సాక్షి శ్రీకాకుళం

బుధవారం ׀ 28 ׀ ఆగస్టు ׀ 2024



రెవెన్యూలో బదిలీల సందడి

రెవెన్యూలో బదిలీల సందడి నెలకొంది. సిఫారసు లేఖలతోనే పని జరుగుతోంది.

- 8లో

30న గెస్ట్ ఫ్యాకల్టీలకు ఇంటర్వ్యూలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల కోసం ఈ నెల 30న ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు ఇంటర్ విద్య జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి శివ్వాల తవిటినాయుడు తెలిపారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఉన్న జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ప్రక్రియ మొదలవుతుందన్నారు. కేవలం జనరల్ కోర్సుల సబ్జెక్టుల అభ్యర్థులు మాత్రమే హాజరుకావాలని సూచించారు.

ఆదిత్యుని హుండీ ఆదాయం రూ.68.59 లక్షలు

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ హుండీ కానుకల ద్వారా రూ.68,59,166 ఆదాయం లభించినట్లు ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు తెలిపారు. 77 రోజులకు గాను నగదు రూపేణా రూ.66,22,146, చిల్లర రూపేణా రూ.2,37,020 లభించిందని, అలాగే బంగారం 37 గ్రాములు, వెండి మూడు కేజీల 400 గ్రాములు మొక్కుల్లో భాగంగా లభించినట్లు తెలిపారు. మంగళవారం లెక్కింపు నిర్వహించారు.

న్యూస్‌రీల్

యోగా శిక్షకులకు ఆహ్వానం



మాట్లాడుతున్న వైద్యాధికారిణి పద్మజ

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి హోమియో వైద్యశాలలోని ఆయుష్ ఆరోగ్య మందిరంలో యోగా శిక్షకులుగా పని చేసేందుకు ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ పి.పద్మజ తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ యోగాలో పీజీ, డిప్లమో చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. నెలలో 20 గంటలు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని, గంటకు రూ.250 చొప్పున గౌరవవేతనం ఇస్తామని తెలిపారు. అర్హులైన మహిళా అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ 11 గంటల్లోపు సంతవురిటి హోమియో వైద్యశాలలో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9441750473 నంబరును సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ప్రారంభం కాని ఇసుక స్టాక్ పాయింట్



శాలిహుండం కొండ వద్ద పరిశీలన చేస్తున్న ఆర్డీఓ, అధికారులు

గార: మండలంలో శాలిహుండం, గారలో ఇసుక స్టాక్ పాయింట్‌ను మంగళవారం అధికారులు పరిశీలించారు. అయితే ప్రభుత్వం ప్రకటించినట్టుగా ఇసుక విక్రయాలు మాత్రం ప్రారంభం కాలేదు. ఉదయం ఆర్డీవో సీహెచ్ రంగయ్య, తహసీల్దార్ ఎస్.రమణారావు, ఇరిగేషన్, మైన్సు అధికారులు శాలిహుండం కొండ వద్ద ఇసుక పాయింట్ కోసం స్థల పరిశీలన చేశారు. నదిలో నీరు ప్రవహిస్తుండటం, ఇసుక నది నుంచి తీసుకువచ్చి, స్టాకు పాయింటులో వేసి వాహనదారులకు ఇవ్వడం ప్రహసనంగా ఉందని నిర్ధారించారు. గతంలో గార గ్రామశివారులోని కల్వర్టు వద్ద స్టాక్ పాయింటు ఉండేది. మండలం వైపు కాకుండా వనిత మండలం వైపు భారీగా ఇసుక మేటలున్నాయి. వాటిని గార రోడ్‌లోకి తీసుకువచ్చేలా ఇరిగేషన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ రోడ్డు సదుపాయం అనువుగా ఉంటుందని గుర్తించి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని ఆర్డీఓ తెలిపారు.

కాఖండ్యాంలోనూ పరిశీలనే..



ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న ఆర్డీఓ రంగయ్య

బూర్జ: ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ రంగయ్య హెచ్చరించారు. మండలంలోని మామిడివలస పంచాయితీ కాఖండ్యాం గ్రామ పరిధిలోని నాగావళి నది ఒడ్డున ఇసుక ర్యాంపును ఆర్డీఓ రంగయ్య మంగళవారం పరిశీలించారు. అయితే ముందు ప్రకటించినట్లు విక్రయాలు మాత్రం ప్రారంభించలేదు. కేవలం ఇసుక డంపింగ్ పాయింట్, చెక్ పాయింట్, బుకింగ్ స్థలాన్ని పరిశీలించారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించే ప్రయత్నం?

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఎలాగైనా తొలగించేందుకు అధికారులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరలో జరగబోయే పాలక మండలి సమావేశంలో ఈ అంశాన్ని పెట్టి తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు. వీరికి ఎనిమిది నెలల వేతనాలు బకాయి ఉండగా.. వాటి చెల్లింపునకు సైతం నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు. ఎనిమిది నెలల వేతనం అందజేసి, 34 మందిని తొలగించేందుకు పథక రచన చేశారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని ఈ నెల 24వ తేదీన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కలిసి ఉద్యోగ భద్రత, వేతనాలు చెల్లింపు అంశం వివరించి, న్యాయం చేయాలని కోరారు. వర్సిటీ అటానమస్ సంస్థ కావడం వల్ల అధికారులనే అడగాలని ఆయన సూచించారు. దీంతో ఈ ఉద్యోగులు వర్సిటీ కీలక అధికారులను కలిసేందుకు మంగళవారం అనుమతులు అడిగారు. అయితే కొంత మందిని మాత్రమే రావాలని సూచించటంతో ఇద్దరు మాత్రమే వెళ్లారు. మరో పక్క వీరి నుంచి ఫోన్లు సైతం సెక్యూరిటీ సిబ్బంది స్వాధీనం చేసుకొని లోపలకు పంపారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మంత్రిని కలవటం, నిరసనలు తెలియజేయటం, పత్రికలకు ఆవేదన చెప్పటం వంటివి వారు తప్పు పట్టినట్లు సమాచారం. తమను తొలగించేందుకు ఇన్ని ప్రయత్నాలు జరుగుతుండడంతో ఔట్ సోర్సింగ్ సిబ్బంది తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.



ఆలోచనలో మార్పు రావాలి

కన్నవారిని, తోడబుట్టిన వారిని అందరినీ విడిచి ఉద్యోగాలు చేస్తుంటాం. మాపట్ల పురుషులకు ఉండే ఆలోచనలో మార్పు రావాలి. సమాజంలో ఉన్న ప్రతి మహిళను గౌరవించాలి. అప్పుడే మహిళలకు రక్షణ లభిస్తుంది.

– ఎన్.సుజాత, ఎక్స్‌రే టెక్నీషియన్, సీహెచ్‌సీ ఇచ్ఛాపురం



ప్రత్యేక చట్టాలు అమలు చేయాలి

మహిళా వైద్య సిబ్బంది భద్రతకు ప్రత్యేక రక్షణ చట్టాలు ఉండాలి. పని చేస్తున్న ఆస్పత్రుల వద్ద పోలీస్ భద్రత ఉండాలి. వైద్య సిబ్బందిపై ఏదైనా సంఘటన జరిగితే తక్షణమే న్యాయం జరిగే విధంగా చట్టం ఉండాలి. ప్రతి ఆస్పత్రి వద్ద ఔట్‌పోస్టు ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ ధనలక్ష్మి, ప్రసూతి వైద్యురాలు, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, టెక్కలి





పటిష్ట భద్రత ఉండాలి

ఆస్పత్రిలో ఎలాంటి సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలి. రోగులతో వచ్చే వారు వైద్య సిబ్బంది పట్ల గౌరవంగా మెలగాలి. వైద్యులు దేవుడితో సమానం అనే భావన కలిగి ఉండాలి.

– ఎం.లక్ష్మి, స్టాఫ్ నర్స్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, టెక్కలి



వంశధార జలాశయం గట్టుపై తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలు

వంశధార గట్లపై నాటుకుపోతున్న నిర్లక్ష్యం

అధికారులు 'తుమ్మ'కు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో అత్యంత కీలకమైన, అతి పెద్దదైన వంశధార జలాశయం గట్లపై తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కల వేళ్లు నాటుకుపోతుంటే.. ఏ మాత్రం చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా వంశధార గట్టు బలహీనపడేలా కనిపిస్తోంది. మొక్కే కదా అని వదిలేస్తే భవిష్యత్‌లో ప్రమాదం ముంచుకు వస్తుంది.

- ప్రమాదంలో వంశధార రిజర్వాయర్ గట్టు
- 7 కిలోమీటర్ల పొడవునా తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలు
- అతి పెద్ద ప్రాజెక్టుకు పొంచి ఉన్న ముప్పు
- వేళ్లు నాటుకున్న పరిస్థితి
- జలాశయానికి ప్రమాదం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: వంశధార ఫేజ్–2 రిజర్వాయర్ గట్టును అధికారుల నిర్లక్ష్యం బలహీనం చేస్తోంది. గట్టు పటిష్టత ప్రశ్నార్థకంగా మారేలా పిచ్చి మొక్కలు పెరిగిపోతూ ఉంటే.. వాటిని తొలగించాల్సిన అధికారులు అశ్రద్ధ వహిస్తున్నారు. మొక్కల తొలగింపుపై ముందు చూపులేకపోతే భవిష్యత్‌లో భారీ నష్టాన్ని చవిచూడాల్సి వస్తుంది. ఇంకా ప్రారంభానికే నోచుకోలేదు. అప్పుడే వంశధార ఫేజ్–2 రిజర్వాయర్ గట్టు ప్రమాదంలో పడింది. ప్రస్తుతం 7 కిలోమీటర్ల గట్టు పొడవునా గుబురుగా తుమ్మ, ఇతర చెట్లు భారీగా మొలిచాయి. కొన్నిచోట్ల వేళ్లు నాటుకునిపోయాయి. వీటి వలన గట్టు సామర్థ్యం దెబ్బతినడమే కాకుండా పాములు, ఇతరత్రా క్రిమికీటకాలు సంచరించడానికి అవకాశం ఉంటుంది. అదే జరిగితే గట్టు పటిష్టతపై ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గట్టుకు ప్రమాదమని కూడా చెబుతున్నారు.

వైఎస్సార్ శ్రీకారం చుట్టిన ప్రాజెక్టు..

2005లో జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వంశధార



బలహీనమవుతున్న వంశధార జలాశయం గట్టు



విపరీతంగా పెరిగిపోతున్న మొక్కలు

ఫేజ్–2 రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో అతి పెద్ద ప్రాజెక్టు ఇది. ప్రాజెక్టు పూర్తయితే అటు పలాస శివారు ప్రాంతాల వరకు సాగు, తాగునీరు అందుతాయి. కానీ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రాజెక్టు నిర్మాణ పనులు నత్తనడకన సాగాయి. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే పనులు ఊపందుకున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో 97 శాతం పనులు పూర్తయ్యాయి. ఇంకా స్పిల్ వే, పీఆర్‌సీ శ్లాబు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. గేట్లు, రిప్ ర్యాపు, సాడిల్ డ్యామ్, రాతిపేర్పు పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

మొక్కే కదా అని వదిలేస్తే..

- రిజర్వాయర్ పూర్తి స్థాయిలో ప్రారంభం కాక ముందే గట్టుపై భారీగా తుమ్మ, ముళ్ల చెట్లు పెరిగిపోయాయి.
- గట్టు ఉన్న 7 కిలోమీటర్ల మేర ఇవి విస్తరించాయి.
- గట్టు ఎత్తు 73.06 మీటర్లుకాగా..2.19 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టిని వినియోగించారు.
- అయితే చెట్ల వేళ్లు గట్టును నాశనం చేస్తున్నాయి.
- జంగిల్ క్లియరెన్స్ చేపట్టాల్సి ఉన్నా యంత్రాంగం పట్టించుకోవడం లేదు.
- 19 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ రిజర్వాయర్ నిర్మాణానికి కేటాయించిన నిధులు రూ.601.45 కోట్లు కాగా ఇప్పటివరకూ ఖర్చు చేసింది రూ.536.44 కోట్లు.
- ఇంకా రూ.65 కోట్లతో మిగతా 3 శాతం పెండింగ్ పనులు పూర్తిచేయాల్సి ఉంది.

కాంట్రాక్ట్ సంస్థకు చెప్పాం

వంశధార ఫేజ్–2 రిజర్వాయర్ పనులను సోమ అండ్ పటేల్ కంపెనీ చేస్తోంది. పనులు పూర్తయిన మూడేళ్ల వరకు ఆ సంస్థే నిర్వహణ చూసుకోవాలి. చెట్లు, ముళ్ల పొదలు తొలగించడంతో పాటు నిర్వహణ చూసుకోవాలని ఇప్పటికే చెప్పాం. ఆ పనులుజరిగేలా చూస్తాం.

– పి.రాంబాబు, బీఆర్‌ఆర్ వంశధార ప్రాజెక్టు సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్, శ్రీకాకుళం

పటిష్టత ప్రశ్నార్థకం..?

ఇంతటి ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుకు సంబంధించిన రిజర్వాయర్ గట్టు నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం కనబడుతోంది. మొక్కే కదా అని వదిలేస్తే భవిష్యత్‌లో అవి ఎంత విపత్తుకు దారితీస్తాయో ఊహించలేని పరిస్థితి ఏర్పడనుంది. చెరువులను ఆక్రమిస్తే వరద ముంపు వచ్చినట్టు.. కొండల్ని కరిగిస్తే గాలులతో గ్రామాలకు ముప్పు వాటిల్లినట్టు... రిజర్వాయర్ గట్లపై మొక్కలు పెరిగితే ఆ గట్టుకు ప్రమాదం ముంచుకు వస్తుంది. గట్టుకు అన్ని వైపులా గ్రాస్ మేట్ తరహాలో చిన్న చిన్న గడ్డి మొక్కలు ఉండేలా చూసుకోవాలే తప్ప తుమ్మ చెట్లు, ఇతరత్రా భారీ చెట్లు గట్టుపై పెరిగితే దాని పటిష్టత ప్రశ్నార్థకమవుతుంది.

8 మంది డీటీలకు రివర్షన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో రెవెన్యూ విభాగంలో ఎనిమిది మంది డిప్యూటీ తహసీల్దార్లకు రివర్షన్ ఇవ్వనున్నారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు సన్నద్ధమవుతున్నారు. వీరందరికీ గత ప్రభుత్వం పదోన్నతులు కల్పించి, పౌర సరఫరాలు, ఇతర విభాగాల్లో పోస్టింగ్‌లు ఇచ్చింది. అయితే కొత్త ప్రభుత్వం వచ్చాక డీటీల కేడర్లను తగ్గించే ప్రక్రియకు తెర తీసింది. గతంలో సీనియర్ అసిస్టెంట్ నుంచి డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతులు ఇచ్చారు. ఇలా పదోన్నతులు పొందిన వారిలో అందరూ ఎస్సీ, ఎస్టీ, బీసీలే ఉన్నారు. తాజాగా రివర్షన్ వచ్చిన వారిలో జి.జాషువా, జి.ప్రసాదరావు, జి.కృష్ణారావు, వి.సున్నాద, ఎస్.కిరణ్ కుమార్, ఆర్.రామా రావు, కె.గాయత్రి, బి.శ్రీనివాసరావు ఉన్నారు. వీరిని తిరిగి సీనియర్ అసిస్టెంట్లుగా నియమించేందుకు రివర్షన్ ఫైల్‌ను సిద్ధం చేశారు. ఈ వైఖరిపై దళిత సంఘాల జేఏసీ నేతలు బెలమర ప్రభాకర్, డి.గణేష్, బోనెల అప్పారావు తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు.

రెవెన్యూ సదస్సులకు సన్నద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: త్వరలో జరగనున్న గ్రామ రెవెన్యూ సదస్సులకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి మంగళవారం సాయంత్రం ఆయన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడారు. త్వరలో సున్నితమైన భూ సమస్యలపై సదస్సులు నిర్వహిస్తున్నందున అసైన్డ్ భూములపై మరోసారి సర్వే పూర్తి చేయాలని, జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో త్వరలోనే గ్రామాల వారీ తేదీలు ఖరారు చేస్తామని, ప్రతిష్టాత్మక ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. మీ కోసంలో వచ్చిన వినతులలో ఎన్ని పరిష్కరించారు? ఎన్ని వివిధ దశల్లో ఉన్నాయి? ప్రతి రోజు సమీక్షించాలన్నారు. రీ ఓపెన్ కేసులు ఒక్కటి కూడా నమోదు కాకూడదని చెప్పారు. ఈ–పంట నమోదుకు సెప్టెంబర్ 15 వరకు మాత్రమే సమయం ఉందని, ఈ లోగా పంట వివరాలు నమోదు చేయాలన్నారు.

అసలైన దోషులను శిక్షించాలి

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తను హత్య చేయడం దారుణం
- ఎస్పీని కలిసిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం క్రైమ్ : ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కూన ప్రసాద్‌ను టీడీపీ వర్గీయులు హత్య చేయడం అత్యంత దారుణమని, ఒక సామాన్యుడిని అంతమొందించడం అన్యాయమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక జరుగుతున్న వరుస దాడుల విషయమై చర్చించడానికి మంగళవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని కృష్ణదాస్ కలిశారు. ఎస్పీకి వినతిపత్రం అందించిన అనంతరం కార్యాలయం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. కూన ప్రసాద్ హత్యకు సంబంధించి 12 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, ఇప్పటికి నలుగురిని అరెస్టు చేశారని, అసలైన దోషులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని, పోలీసులు న్యాయంగా దర్యాప్తు చేయాలని ఎస్పీని కోరామన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

మూడేళ్ల కిందట నరసన్నపేట నియోజకవర్గం జలుమూరు మండలం అల్లాడపేట మాజీ సర్పంచ్ కళ్యాణం అచ్చన్నను ఇదే విధంగా హత్య చేశారని, ఇప్పుడు అతని కుమారుడిని సైతం టీడీపీ వాళ్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పామన్నారు. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సరైన దర్యాప్తు ప్రారంభించాలని, ఇలాంటి చర్యలకు పాల్పడేవారిపై పోలీసులు దృష్టిసారించాలని కోరామన్నారు.

కుటుంబాన్ని జగన్ పరామర్శిస్తారు..

టీడీపీ కార్యకర్తల చేతిలో హతమైన కూన ప్రసాద్ కుటుంబాన్ని తాము పరామర్శించామని, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా ఆ కుటుంబానికి ధైర్యం చెప్పేందుకు వీలు చూసుకుని వస్తారని కృష్ణదాస్ మీడియాతో అన్నారు. కృష్ణదాస్ వెంట ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, పార్టీ ముఖ్య కార్యకర్తలు ఉన్నారు.



ఆకలి ముందు జాతివైరం ఓడిపోయింది. తల్లి లేని ఓ పిల్లి కూన ఆకలిని శునకం తీర్చింది. వజ్రపుకొత్తూరు మండలం ఉంద్రుకుడియా గ్రామంలో మంగళవారం కనిపించిన దృశ్యం స్థానికులను ఆశ్చర్యపరిచింది. – వజ్రపుకొత్తూరు/కాశీబుగ్గ

అటు నీరు.. ఇటు కన్నీరు

- బంగాళాఖాతంలో వరద నీరు కలిసే చోట ఇసుక మేటలు
- నీట మునుగుతున్న వందలాది ఎకరాలు
- జలదిగ్బంధంలో చిక్కుకుంటున్న పలు గ్రామాలు
- పొగురు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం బాధితుల నిరీక్షణ

వజ్రపుకొత్తూరు రూరల్ / ఇచ్ఛాపురం రూరల్: ఉప్పుటేర్లు ఏటా ముప్పు తెచ్చి పెడుతున్నాయి. వానాకాలంలో ఏర్పడే పొగురు(ఇసుక మేట)తో వందలాది ఎకరాల్లో పంట నీట మునుగుతోంది. ప్రభుత్వాలు ఎన్ని మారుతున్నా ఇక్కడి సమస్యకు మాత్రం శాశ్వత పరిష్కారం లభించడం లేదు. వర్షాలు అధికమైతే గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి.

వదలని వరద నీటి ముప్పు

ఒడిశా–ఆంధ్ర సరిహద్దు ప్రాంతాలతో పాటు పరిసర ప్రాంతాల్లో పడిన వర్షం నీరు బెండి గెడ్డలోకి చేరి అక్కడి నుంచి ఉధృతంగా ప్రవహించి ఉప్పుటేరులో చేరుతుంది. ఉప్పుటేరు ద్వారా నువ్వలరేవు తీరాన ఈ వరదనీరు బంగాళాఖాతంలో కలుస్తుంది. ఈ సమయంలో సముద్ర తీరాన పెద్ద ఎత్తున ఇసుక మేట(పొగురు) వేయడంతో వరద నీరు సముద్రంలో కలిసేందుకు ఇసుక మేట అడ్డుగా మారి నేరుగా గ్రామంలోకి వచ్చేస్తోంది. దీంతో పరిసర గ్రామాలైన పూడి లంక సైతం జలదిగ్బంధంలో



వరద నీటి ఉధృతితో ఉప్పొంగిన ఉప్పుటేరు

చిక్కి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. పూండిగల్లి, నగరంపల్లి, కాశీనగర్, రాజిపేట, వజ్రపుకొత్తూరు, సీతాపురం, బెండి, పెద్దటొడ్లపాడు, తాడివాడ, కిడిసింగి తదితర గ్రామాల్లో సుమారు 6 వందల ఎకరాల పంట పొలాలు నీట మునిగి పంట నష్టం వాటిల్లుతోంది. ఏటా ఇదే పరిస్థితి. ఈ సమస్య వచ్చినప్పుడు గ్రామస్తులంతా ఏకమై పొగురును తొలగించుకుంటున్నారు తప్పితే ప్రభుత్వాలు మాత్రం శాశ్వత ప్రాతిపదికన ఏ పరిష్కార మార్గం చూపలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పొగురు వేయకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

బాహుదా పరిసరాల్లోనూ..

ఇచ్ఛాపురం మండలం డొంకూరు, కవిటి మండలం ఇద్దివానిపాలెం పరివాహక ప్రాంతంలో ఉప్పుటేర్లు సముద్ర ప్రాంతంలో కలిసే ప్రాంతాల్లోనూ పొగురు సమస్య తప్పడం లేదు. ఇచ్ఛాపురం మండలంలో కేశుపురం, సన్యాసిపుట్టుగ, బూర్జపాడు, డొంకూరు, లక్ష్మీపురం, శివకృష్ణాపురం పంట భూములు, కవిటి మండలంలో బొరివంక, బి.గొనపపుట్టుగ, వరక, కుసుంపురం, బల్లిపుట్టుగ, మాణిక్యపురం, సోంపేట మండలం ఇసుకలపాలెం, బారువా, గొల్లగండి పంట పొలాల వరకు పొగురుతో పంట పొలాలు ఉప్పు నీటి బారిన పడుతున్నాయి.

ప్రభుత్వాలే ఆలోచించాలి

ఆరుగాలం శ్రమించి పండించే పంట ఉప్పునీటి బారిన పడితే పంట గింజలు చేతికి వచ్చే అవకాశమే లేదు. ఏటా రెండు, మూడు సార్లు పొగురు సమస్య తప్పడం లేదు. వంట పొలాల్లో ఉప్పునీరు వెళ్లిపోయినప్పటికీ ఉప్పుకారి వరి దుబ్బుల్లో ఉండి పోవడంతో వాటిని కడిగేందుకు శ్రమ పడాల్సి వస్తోంది.

– దున్న గురుమూర్తి, వైస్ ఎంపీపీ, బూర్జపాడు



యంత్రాల సాయంతో ఇసుక మేట తొలగిస్తున్న గ్రామస్తులు

ఏటా ఇదే పరిస్థితి

వరదలు వచ్చిన ప్రతి సారి మాది ఇదే పరిస్థితి. వర్షాలు వస్తే వరద, వానలు ఆగాక దారుల్లో వ్యర్థాలతో రోగాల బారిన పడుతున్నాం. మా పరిస్థితిని చూసి చలించేవారు లేరు. మాకు ఈ పొగురు కష్టాలు తీరేదెప్పుడు అని ఎదురుచూస్తున్నాం.

– నువ్వల రేవు మహిళలు, వజ్రపుకొత్తూరు మండలం

ఏటా పంట నష్టపోతున్నాం



ఏటా నువ్వలరేవు సముద్ర తీరాన ఇసుక మేట వేయడంతో ఉప్పుటేరు వరద నీరు ఉప్పొంగి పంట పొలాలపైకి చేరుతోంది. తీరంలో ఇసుక మేట శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలి.

– బి.కేశవరావు, రైతు, నగరంపల్లి, వజ్రపుకొత్తూరు మండలం

పొలాలు నీట మునుగుతున్నాయి



నువ్వలరేవు వద్ద ఇసుక మేట వేయడంతో ఉప్పుటేరు ఉప్పొంగి మా పంట పొలాలు నీట మునిగిపోతున్నాయి. ఏం చేయాలో తెలియక వరదలు వచ్చిన ప్రతి ఏటా నష్టపోతూనే ఉన్నాం. పొగురు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– టి.రామయ్య, రైతు, సీతాపురం, వజ్రపుకొత్తూరు మండలం

క్లుప్తంగా

ఫిలిం చాంబర్స్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

పలాస: మన ఫిలిం ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర అధ్యక్షుడు జె.ఎస్.రాజేంద్ర ఆదేశాల మేరకు జిల్లా శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక పలాసలో మంగళవారం ఏకగ్రీవం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కుమార్‌నాయక్, గౌరవ అధ్యక్షుడిగా తెప్పల కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా డి.ఎ.స్టాలిన్, కోశాధికారిగా బమ్మిడి కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా మద్దు ఈశ్వరమ్మ, సంయుక్త కార్యదర్శులుగా బమ్మిడి రుక్మంగధరరావు, తంగి శోభారాణి, మరో ఏడుగురిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

29న వ్యవసాయ యాంత్రీకరణ మేళా

శ్రీకాకుళం రూరల్ : రాగోలులో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధన స్థానంలో ఈ నెల 29న యాంత్రీకరణ మేళా నిర్వహించనున్నట్లు సంచాలకుడు డాక్టర్ పి.వి.సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

10న జిల్లాస్థాయి పోటీలు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురం బేతాళ యువజన సంఘం 23వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి క్విజ్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 10న 8,9,10 తరగతుల విద్యార్థులకు క్విజ్ పోటీలు జరుగుతాయని, వివరాలకు 9000045663, 9110784445 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో 2, ఆరో తరగతిలో 3, ఎనిమిదో తరగతిలో 2, ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ఎంపీసీలో 11, బైపీసీలో 2 సీట్లు చొప్పున ఖాళీగా ఉన్నట్లు వివరించారు. ఈ నెల 30న ప్రతిభా పరీక్ష నిర్వహించి సీట్లు కేటాయిస్తామని తెలిపారు. ఆధార్ జిరాక్స్, మార్కుల ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

ప్రత్యేక చట్టాలు అవసరం



మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్న మహిళా వైద్యులు, స్టాఫ్‌నర్స్, వైద్య సిబ్బందికి మరింత రక్షణ అవసరం. కోల్‌కతా ఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలి.

– ఏ.తేజశ్విత, వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ వైద్యాధికారి

భరోసా కల్పించాలి



ఆరోగ్య వైద్య కేంద్రాలలో పని చేస్తున్న మహిళా సిబ్బంది రక్షణకు ప్రభుత్వాలు భరోసా కల్పించాలి. రాత్రి వేళల్లో విధులు నిర్వర్తించే వైద్యులు, నర్సులు, ఇతర మహిళా సిబ్బందికి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి. మహిళల రక్షణకు కఠినమైన చట్టాలు ఎంతో అవసరం.

– బి.నీలవేణి, వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ సీనియర్ సహాయకురాలు



సామాజిక చైతన్యంతోనే రక్షణ



వృత్తిపరంగా ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యులు దైవంతో సమానంగా భావించేతత్వం పెంచాలి. నైట్ డ్యూటీలో ఆపద వస్తే వాచ్‌మెన్ మినహా ఎవ్వరూ అందుబాటులో ఉండరు. మహిళా వైద్యులకు రక్షణ కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అప్పుడే భయాందోళనలు వదిలి రోగులకు మెరుగైన సేవలు అందించగలరు.

– డాక్టర్ ఎస్.ఉమాగౌరి, హోమియో వైద్యురాలు, తెంబూరు

‘రెవెన్యూ’లో బదిలీల సందడి

- అన్ని స్థాయిల ట్రాన్స్‌ఫర్లకు సిఫారసు లేఖలు!
- ఇటీవల పోస్టింగ్ ఇచ్చిన తహసీల్దార్లకూ తప్పని స్థానచలనం



శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా రెవెన్యూ విభాగంలో బదిలీల సందడి నెలకొంది. మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉన్నందున ఉద్యోగులు వారికి కావాల్సిన చోటు కోసం కుస్తీ పడుతున్నారు. వీఆర్వో నుంచి తహసీల్దారు వరకు అన్ని కేడర్లకు ఒకేసారి బదిలీకి అవకాశం ఇవ్వడం, సర్వీసుతో పనిలేకుండా ‘జీరో’ సర్వీసును పరిగణనలోకి తీసుకోవడం, ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన వారికి బదిలీ తప్పనిసరి చేయడంతో రెవెన్యూ శాఖలో కోలాహలం నెలకొంది. రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్న వారికీ సమస్య తప్పడం లేదు.

నేతల చుట్టూ ప్రదక్షిణలు..

మంత్రి, శాసన సభ్యుల సిపారసు లేఖలు ఉన్నవారికి కావాల్సిన చోట పోస్టింగ్ ఇవ్వడంలో ప్రాధాన్యత కల్పించడంతో ఉద్యోగులు నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరు నేతలు సిపారసు లేఖకు సైతం రేటు నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే అదునుగా వీఆర్వో నుంచి తహసీల్దారు వరకు కేడరు బట్టి రూ.50 వేలు నుంచి రూ.లక్షల్లో వసూలు జరుగుతున్నట్లు సమాచారం. వీఆర్‌ఓ పోస్టింగ్ కావాలంటే ఆ గ్రామ టీడీపీ కార్యకర్తల సిఫారసు తప్పనిసరిగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వీరిని కాదని ఎమ్మెల్యే వద్దకు వెళ్లినా ఆ గ్రామం కార్యకర్తల సిఫారసు ఉండాలని తిప్పి పంపించేస్తున్నారు. దీంతో గ్రామ స్థాయి కార్యకర్తలు సైతం వసూళ్లు చేస్తున్నారని వీఆర్‌ఓలు ఆందళన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఇతర కేడర్ల ఉద్యోగులకు మండల స్థాయి నాయకుల సిఫారసు లేకపోతే బదిలీ పోస్టింగ్ ఇచ్చే పరిస్థితి లేదు.

అధిక సంఖ్యలో బదిలీలు..

ఈసారి ‘జీరో’ సర్వీసును పరిగణనలోకి తీసుకోవడంతో ఎక్కువ సంఖ్యలో బదిలీలు జరగనున్నాయి. ప్రధానంగా వీఆర్వోలు, డీటీలు, సీనియర్ అసిస్టెంట్లు, ఆర్‌ఐలు బదిలీలు కానున్నారు. వీఆర్వోల బదిలీల దరఖాస్తులు గడువు పూర్తయింది. మిగిలిన కేడర్ల వారు ఈ నెల 29 వరకు దరఖాస్తు చేసుకొనే వెసులుబాటు ఉన్నందున, ఇంకా సిపార్సు లేఖలు కూడా పూర్తి స్థాయిలో అందనందున ఈ బదిలీలు జాప్యం అయ్యే పరిస్థితి నెలకొంది. ఇక ఐదేళ్లు ఒకే చోట పనిచేసిన వారికి బదిలీ తప్పనిసరి కానుంది. దీంతో కలెక్టరేట్‌లో ఎక్కువ మంది బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఇటీవల ఎన్నికల విధుల్లో ఇతర జిల్లాలకు వెళ్లిన వారు అక్కడ సర్వీసును బదిలీలకు పరిగణనలోకి తీసుకోవడంలేదు. దీంతో ఎన్నికల ముందు వారు పనిచేసిన చోట ఐదేళ్లయితే తప్పనిసరిగా ట్రాన్స్‌ఫర్ కావాల్సి ఉంటుంది. ఇలా కలెక్టరేట్‌లో ఇటీవల వచ్చిన తహసీల్దార్లు ముగ్గురు బదిలీ కావాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు కలెక్టరేట్ ఉద్యోగులు కుస్తీలు పడుతున్నారు.

గిరిజనుల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక

- ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్
- ఎస్టీ మాకివలసలో పర్యటన


గిరిజనుల సమస్యలపై మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్

జలుమూరు: మండలంలోని మర్రివలస పంచాయతీ పరిధిలోని ఎస్టీ మాకివలస గిరిజనుల సమస్యలపై ప్రభుత్వానికి నివేదించనున్నామని ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్ నాయక్ అన్నారు. మంగళవారం ఎస్టీ మాకివలసలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల జోలికి వస్తే సహించేది లేదన్నారు. ఆదివాసీల హక్కులకు భంగం కలిగించేలా ‘హరే రామ హరే కృష్ణ’ సంస్థ వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. అనంతరం స్థానికులు మాట్లాడుతూ కనీస వసతులైన తాగునీరు, సీసీ రోడ్లు, ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగీశ్వరరావు మాట్లాడుతూ మూడు తరాలుగా సాగు చేసుకున్న వ్యవసాయ పొలాలను అన్యాయంగా వేరొకరికి అమ్మకాలు చేయడంతో జీవనాధారం కోల్పోయినట్లు తెలిపారు. గ్రామం ఏర్పడి సుమారు 80 ఏళ్లు దాటుతోందని, అప్పటి తమ భూముల రికార్డులను తారుమారు చేసి ఓ వ్యక్తి ఎక్కువ భూమి కలిగి ఉన్నా అధికారులు ల్యాండ్ సీలింగ్ చట్టం కింద కేసులు నమోదు చేయలేదని వివరించారు. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని సాగుహక్కులో ఉన్న భూములను పెత్తందార్లు వేరొకరికి అమ్మకాలు చేయడం తమ పొట్టడమే అని వారు వాపోయారు.

రెవెన్యూ అధికారులపై అసహనం..

ప్రధానంగా రెవెన్యూ శాఖకు సంబంధించి భూములపై ఇక్కడ వివాదం నడుస్తుంటే ఆ శాఖ తహసీల్దార్, డీటీ, ఆర్‌ఐలు హాజరుకాకపోవడంపై వడిత్య శంకర్ నాయక్ అసహనం వ్యక్తం చేశారు. ముందుగా జలుమూరు తహసీల్దార్ లక్ష్మీనారాయణకు ఫోన్‌లో మాట్లాడగా కోర్టు పని వల్ల హాజరు కాలేదని వివరించారు. కనీసం డీటీ, ఆర్ఐ స్థాయి అధికారులైనా హాజరై భూములు వివరాలు చెప్పాల్సిన బాధ్యత లేదా అని మండిపడ్డారు. అనంతరం పలువురు గిరిజనులు కమిషన్ సభ్యులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడికి అభయమిచ్చిన ఎస్పీ


మాధవయ్య సమస్య వింటున్న ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : యువ ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డికి వృద్ధులంటే మమకారం అన్న విషయం మరోసారి స్పష్టమైంది. ప్రతి సోమవారం జరిగే మీకోసం వేదికలో వృద్ధుల కోసం బయటకొచ్చి మరీ ఓపికగా సమస్యలు వింటున్నారనే చర్చ ఇప్పటికే ఉంది. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయానికి ఎస్పీ వచ్చిన సమయంలో.. కాలు లేని వృద్ధ దివ్యాంగుడు పైలా మాధవయ్య దీనంగా కూర్చుండటం చూశారు. వెంటనే అతని వద్దకు వెళ్లి సమస్యపై ఆరా తీశారు. తనది ఎల్ఎన్‌పేట మండలం కోవిలం గ్రామమని, నిరుపేద కుటుంబమని, నాటుకోళ్ల క్రయ విక్రయాలు చేస్తూ జీవనం సాగిస్తున్నానని చెప్పాడు. తమ గ్రామానికే చెందిన ఓ వ్యక్తి తన నాటుకోళ్లను దొంగిలించాడని.. ఈ విషయంపై సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని.. అక్కడి పోలీసులు పట్టించుకోకపోవడంతో మీతో బాధ చెప్పుకునేందుకు వచ్చానని బదులిచ్చాడు. వెంటనే ఎస్పీ స్పందించి సరుబుజ్జిలి ఎస్ఐతో ఫోన్లో మాట్లాడారు. మాధవయ్య సమస్యను పరిష్కరించి, కోళ్లు అపహరించిన వ్యక్తితో బాధితునికి నష్టపరిహారాన్ని ఇప్పించాలని ఆదేశించారు.

జిల్లా ఇంజినీరింగ్ కళాశాలల్లో 82 శాతం ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన మూడో విడత కౌన్సెలింగ్‌కు సంబంధించి ఉన్నత విద్యా మండలి మంగళవారం వెబ్‌సైట్‌లో పెట్టింది. జిల్లాలో నాలుగు కళాశాలలు ఉండగా మూడో విడత 2154 కన్వీనర్ సీట్లకు 1765 ప్రవేశాలు జరిగాయి. మొత్తం 82 శాతం ప్రవేశాలు పూర్తయ్యాయి.

మొదటి విడతలో 1847, రెండో విడతలో 1903 ప్రవేశాలు జరిగాయి. టెక్కలి ఐతం 1104 సీట్లకు 1001, చిలకపాలెంలో శివానీలో 384 సీట్లకు 291, ఎచ్చెర్ల శ్రీ వేంకటేశ్వరా కళాశాలలో 336కి 228, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 330కి 245 ప్రవేశాలు జరిగాయి. విద్యార్థులు ఈ నెల 30లోపు కళాశాల్లో చేరాల్సి ఉంటుంది.

ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమాలపై చర్యలు


ప్రజావేదికలో పాల్గొన్న డ్వామా పీడీ చిట్టిరాజు, తదితరులు

- ప్రజావేదికలో డ్వామా పీడీ చిట్టిరాజు

కోటబొమ్మాళి: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు అన్నారు. మంగళవారం కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి ప్రజావేదిక నిర్వహించారు. 38 పంచాయతీల్లో 2023–24 ఏడాదిలో జరిగిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ చేయగా.. కొన్ని పంచాయితీల్లో రూ.7.72 లక్షల వరకూ అక్రమాలు జరిగినట్లు రుజువైందని, ఆయా ఎఫ్ఏలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొత్తపల్లి, ఎలమంచిలి, దంత, శ్రీజగన్నాథపురం, సరియాపల్లి తదితర పంచాయతీల్లో జరిగిన అక్రమాలపై చర్చిస్తుండగా వేతనదారుల మధ్య స్వల్పఘర్షణలు తలెత్తడంతో పోలీసులు సద్దుమణిగించారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీలు మురళీకృష్ణ, శైలజ, రాధ, ఏపీఓ పి.హరిప్రసాద్, ఎంపీడీఓ కె.ఫణీంద్ర కుమార్, ఎంపీపీ రోణంకి ఉమ, జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్సీ ఎంఎల్‌టీ ఫలితాల్లో బొల్లినేని విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం రూరల్: బీఎస్సీ ఎంఎల్‌టీ డిగ్రీ ఫలితాల్లో రాగోలు జెమ్స్ కళాశాల బొల్లినేని మెడిస్కిల్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఈ ఫలితాల్లో మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ విభాగంలో టాప్–10 ర్యాంకుల్లో సెకెండియర్ విద్యార్థులు డి.చందు, కె.మాలతి, ఎస్.సి.అంజలి, జి.ప్రమీలా, ఎ.కుమారి సత్తాచాటారని పేర్కొన్నారు. ఫస్టియర్ విద్యార్థిని ఎస్.శృతి ప్రథమ ర్యాంకు సాధించిందని చెప్పారు. మెరుగైన బోధన, నిరంతర పర్యవేక్షణతోనే ఈ ఫలితాలు వచ్చాయని డాక్టర్ ఈ.గిరిధర్ పేర్కొన్నారు.

సాధారణ ప్రసవాలు పెంచాలి


గర్భిణుల సమస్యలు తెలుసుకుంటున్న హెల్త్ కమిషనర్ అట్టాడ సిరి

టెక్కలి రూరల్: టెక్కలి జిల్లా ఆస్పత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని ఏపీ స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కమిషనర్ అట్టాడ సిరి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం టెక్కలి జిల్లా ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. వార్డులు, సీటీ స్కాన్ విభాగాన్ని పరిశీలించి రోగులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులకు నార్మల్ డెలివరీపై అవగాహన కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేస్తామని చెప్పారు. మందుల కొరత లేకుండా చూస్తామన్నారు. ఆస్పత్రిలో రిఫరల్ సంఖ్య తగ్గించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. టెక్కలి జిల్లా ఆస్పత్రికి 200 పడకల సామర్థ్యముందని, ప్రస్తుతానికి 100 మాత్రమే ఉన్నాయని, వాటిని పెంచేందుకు కృషి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ రాజ్యలక్ష్మి, ఆస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ బి.సూర్యారావు, ఆర్ఎంవో డాక్టర్ మహారాజ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడు మృతి


దుర్గాప్రసాద్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

హిరమండలం: తల్లి మందలించిందని వంశధార కుడికాలువలో దూకేసిన జోగి దుర్గప్రసాద్ (22) మంగళవారం శవమై తేలాడు. స్థానిక మైత్రీకాలనీలో జోగి సావిత్రమ్మ అనే మహిళ తన ఇద్దరు కుమారులతో కలిసి నివాసముంటోంది. పెద్ద కుమారుడు దుర్గాప్రసాద్ వ్యాన్ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. చిన్నప్పుడే తండ్రి చనిపోవడంతో తల్లి అన్నీతానై పెంచింది. ఇటీవల దుర్గాప్రసాద్ మద్యానికి బానిస కావడంతో వద్దని వారించింది. సోమవారం మద్యం తాగి రావడంతో మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన దుర్గాప్రసాద్ సాయంత్రం వంశధార కాలువలో దూకేశాడు. దీంతో పోలీసులు, కుటుంబసభ్యులు వెతికారు. రాత్రి కావడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. మంగళవారం ఉదయం పెద్దకోరాడ సమీపంలోని వంతెన వద్ద మృతదేహం బయటపడింది. దీంతో తల్లి సావిత్రమ్మ, సోదరుడు శంకర్ గుండెలవిసేలా రోదించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నారాయణస్వామి తెలిపారు.

గ్రానైట్ రాయి పడి ఇంటి పైకప్పు ధ్వంసం


విరిగిన పైకప్పు

టెక్కలి రూరల్: మండలంలోని గూడేం పంచాయతీ సన్యాసీ నీలాపురం గ్రామంలో రెండు రోజులుగా గ్రానైట్ రాళ్లు పడుతుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామ సమీపంలో ఉన్న గ్రానైట్ క్వారీ నుంచి రాళ్లు దల్లి సూరిబాబు అనే వ్యక్తి ఇంటిపై పడటంతో పైకప్పు విరిగిపోయింది. ఆ సమయంలో ఇంట్లోవారు ఉన్నప్పటికి కొంత దూరంలో రాయి పడటంతో ఎవరికి ప్రమాదం జరుగలేదు. నిత్యం ఇదే పరిస్థితి నెలకొనడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల చిన్నారులు ఆడుకునే సమయంలో రాళ్లు పడితే ఎవరు బాధ్యత వహిస్తారని గ్రామానికి నౌగాపు దామోదరరావు తదితరులు ప్రశ్నిస్తున్నారు. గ్రామంపై రాళ్లు పడకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విస్తృతంగా పశుగణన సర్వే


సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి నారాయణరావు

రణస్థలం: జిల్లా వ్యాప్తంగా 21వ జాతీయ పశుగణన సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని పశుసంవర్ధకశాఖ జిల్లా నోడల్ అధికారి జి.నారాయణరావు చెప్పారు. రణస్థలం వెలుగు కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ సచివాలయ ఉద్యోగులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకు ఒకసారి దేశవ్యాప్తంగా పశుగణన సర్వే చేపడతున్నామని చెప్పారు. అందులో భాగంగా ఆవులు, గొర్రెలు, మేకలు, పందులు, గేదెలు తదితర 16 రకాల జాతులను లెక్కిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పశుసంవర్ధకశాఖ సచివాలయ అధికారులు 221 మంది నాలుగు నెలల పాటు ఊరూరా గణన చేపడతారని వివరించారు. 69 మంది పర్యవేక్షణలో కుటుంబం పరంగా, డెయిరీల పరంగా పశువుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే అవసరమైన మందులు, పాల ఉత్పత్తి వంటి అంశాలపై స్పష్టత వస్తుందని చెప్పారు. సమావేశంలో రణస్థలం పశుసంవర్ధకశాఖ ఏడీఏ బి.దుర్గారావు, అధికారులు పాల్గొన్నారు.